క్లుప్తంగా

వైద్యులకు ఘన సత్కారం



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళుతున్న వైద్యురాలిని, కొత్తగా విధుల్లోకి వచ్చిన వైద్యుడిని హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్తరామకృష్ణ గురువారం ఘనంగా సత్కరించారు. ఏరియా వైద్యశాలలో కంటి చికిత్స విభాగంలో సేవలందించిన డాక్టర్ తనూజకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఏరియా వైద్యశాలకు అడ్మినిస్ట్రేటర్ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సురేష్ కు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురిని ఘనంగా దుశ్శాలువాల పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మణ్‌రావు, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, వైద్యులు, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

నర్సరీల ఏర్పాటుకు లైసెన్స్ తప్పనిసరి



క్రోసూరు: మండలంలోని పలు నర్సరీలను సత్తెనపల్లి ఉద్యానశాఖ అధికారి సీహెచ్ జనని పరిశీలించారు. షేడ్ నెట్స్ ఏర్పాటు చేసేందుకు, విత్తనాలు కొనుగోలు, నారు పెంపకం పలు అంశాలపై నర్సరీ యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు చేశారు. నర్సరీల ఏర్పాటుకు నర్సరీ యజమానులు తప్పనిసరిగా లైసెన్సు పొందాలన్నారు. ఇంకా లైసెన్సు తీసుకోనివారు, రెన్యువల్ చేయించుకొనేవారు ఉద్యానశాఖ అధికారికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. షేడ్‌నెట్స్ ఏర్పాటు చేసేవారు 8 నుంచి 14 అడుగుల ఎత్తులో ఉండే విధంగా ఎక్కడా కీటకాలు దూరేందుకు రంధ్రాలు లేకుండా చూసుకోవాలన్నారు. నారు పెంచేందుకు శుద్ధిచేసిన కోకో పిట్ మాత్రమే వాడాలన్నారు. లైసెన్సు లేకుండా నారు పెంచినా, నాసిరకం నారు విక్రయించినా ఉద్యాన శాఖ చట్టపరమైన చర్యలు తీసుకుంటుందన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పట్టణంలోని ఆర్యవైశ్య గో సంరక్షణశాల కల్యాణ మండపంలో ఆడి కృతిక పర్వదినాన్ని పురస్కరించుకొని వల్లి దేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. రామాలయం పూజారి మురళీ కృష్ణ కుమారుడు సాయికృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణ వేడుకలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం విష్ణుశర్మ ప్రవచన కార్యక్రమం జరిగింది.

పశుగ్రాసం పెంపకానికి భూమి కేటాయించాలి

అచ్చంపేట: పశుపోషణలో ప్రధానంగా దాణా ఖర్చు తగ్గాలంటే రైతులు తమ సేద్యపు భూమిలో కొంత భాగాన్ని పశుగ్రాసం కోసం కేటాయించాలని పశువైద్యాధికారి డాక్టర్ స్వాతి తెలిపారు. పశుగ్రాస వారోత్సవాలలో భాగంగా మండలంలోని వేల్పూరులో గురువారం జరిగిన అవగాహన కార్యక్రమంలో రైతుల నుద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రభుత్వం పశుగ్రాసంకోసం రైతులకు 50శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. రైతుభరోసా కేంద్రాలలో 2250 కిలోల ఏకవార్షిక జొన్నలను అందుబాటులో ఉంచామన్నారు. ఇవి 5 కిలోల ప్యాకెట్ ధర రూ.240లు కాగా సబ్సిడీపై రూ.120లకు అందజేస్తున్నామని చెప్పారు. ఏకవార్షిక జొన్న గ్రాసాన్ని పశువులు, మేకలు, గొర్రెలు ఇష్టంగా తింటాయని, వాటిలో మంచి పోషక శక్తి ఉంటుందన్నారు. పశువుల పాల దిగుబడి గణనీయంగా పెరుగుతుందని చెప్పారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

మరమ్మతులకు రూ.7లక్షలు మంజూరు

రాజుపాలెం: వ్యవసాయ మార్కెట్ యార్డు స్థలంలో ఉన్న రేకుల షెడ్‌కు వెంటనే మరమ్మతులు చేసేందుకు సమావేశంలో తీర్మానం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కొండ్రెడ్డి సుజాత పరమేష్ అన్నారు. మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో సర్వసభ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ సుజాత మాట్లాడుతూ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశాల మేరకు రేకుల షెడ్‌కు రూ.7లక్షలతో కార్యాలయం ఏర్పాటు చేసుకునేందుకు మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. మరమ్మతులు అయిన వెంటనే కార్యకలాపాలు అక్కడి నుంచే జరుగుతాయని తెలిపారు.

వలంటీర్లకు వందనం

చావుబతుకుల్లో ఉంటే ఆదుకున్నారు



పెదకూరపాడు: ఈ చిత్రంలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పేరు గుడిపూడి మౌనిక. పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరు గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్న మౌనిక సేవలను ఆ గ్రామంలో అందరూ చెప్పుకొంటారు. ముఖ్యంగా కరోనా సమయంలో వ్యాధి బాధితులకు ఆమె చేసిన సేవలను బాధితులు నేటికీ తలుచుకుని, కృతజ్ఞతలు చెబుతారు. కుటుంబ సభ్యులే దూరం పెట్టి.. తలచుకోని పరిస్థితుల్లో కరోనా బారిన పడినవారికి మందులు అందజేయడం.. వారికి కావాల్సిన నిత్యావసరాలు ఇవ్వడం.. వారికి ఏమీకాదంటూ ధైర్యం నూరిపోయడం.. కోవిడ్‌కు వెరవకుండా ఆస్పత్రులకు వెళ్లి పింఛన్లు అందజేయడం వంటి వాటిని చేసిన మౌనిక సేవలను వారు గుర్తు చేసుకుని, కన్నీళ్ల పర్యంతమవుతారు. సొంతవాళ్లే ఆవిధంగా చేయలేదని.. వలంటీర్ తమ కుటుంబ సభ్యుల్లో ఒకరిగా ఉంటూ ఆదుకున్నారని చెబుతున్నారు.

ధైర్యం చెప్పారు.. అభయమిచ్చారు..

కోవిడ్ మహమ్మారి విజృంభణ సమయంలో నాకు కరోనా వచ్చి సత్తెనపల్లి గజ్జల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాను. ఆ సమయంలో నా దగ్గరకు వచ్చేందుకు మా సొంత కుటుంబ సభ్యులే భయపడేవారు. ప్రాణపాయ స్థితిలో ఉన్న నా వద్దకు మా వలంటీర్ గుడిపూడి మౌనిక వచ్చి నాను ఓదార్చి నాకు ధైర్యం చెప్పి పింఛన్ ఇచ్చి వైద్యులతో నా ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంది. ఆమె చెప్పిన మాటలు నాకు ఏంతో ధైర్యాన్ని ఇచ్చాయి. మరల నాకు రెండు నెలల తరువాత తీవ్ర అనారోగ్య సమస్య వచ్చింది. ఆసమయంలో నేను స్పృహలో కూడా లేను మళ్లీ వైద్యశాలకు వచ్చి నాకు పింఛన్ ఇచ్చి ఆదుకుంది. – గుడిపూడి జక్రయ్య, 75త్యాళ్ళూరు, పెదకూరపాడు మండలం

పెన్షన్ ఇచ్చేందుకు ఎంతదూరమైనా ..



పెదకూరపాడు: ఈ చిత్రంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వ్యక్తి పేరు అనుముల వెంకటేశ్వర్లు. పెదకూరపాడు-1 సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్న ఇతని సేవలపై ఆ ప్రాంతంలోని లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారు. ఇతనికి కేటాయించిన 50 ఇళ్లలో అందరితో మంచిగా ఉంటూ, ప్రభుత్వ పథకాల సమాచారం అందిస్తూ.. పథకాలను చేరవేస్తూ.. ప్రతి నెల ఒకటో తేదీనే అవ్వాతాతలను చిరునవ్వుతో పలకరిస్తూ పింఛన్లు అందజేస్తుంటాడు. సేవాభావం కలిగిన వెంకటేశ్వర్లు తన పరిధిలోని లబ్ధిదారులు వైద్య చికిత్స పొందుతూ ఇతర ప్రాంతాల్లో ఉంటున్నా.. వారి సమాచారం తెలుసుకుని, ఎంతదూరమైనా వెళ్లి వారికి పింఛను అందజేస్తాడు.

ఆసుపత్రికి వచ్చి పింఛన్ అందించారు..

నేను ఇటీవల ఆరోగ్య సమస్యలతో విజయవాడ ప్రభుత్వ వైద్య శాలలో చికిత్స పొందాను. ఆ సమయంలో నా వద్ద చిల్లిగవ్వ కూడా లేదు. నాకు ఆరోగ్యం బాగోలేదని తెలుసుకుని మా వలంటీర్ అనుముల వెంకటేశ్వర్లు నా వద్దకు విజయవాడ వచ్చి పింఛన్ అందించారు. అంతేకాదు నా ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకొని నాకు అవసరమైన మందులు అందించారు. ఇలాంటి వలంటీర్ వ్యవస్థ ఎంతోమందికి మంచి చేస్తుంది. వారిని అవమానించడం దారుణం. వారి సేవలకు కృతజ్ఞతలు.
– పెద్ద వెంకటేశ్వర్లు, పెదకూరపాడు

అర్హులందరికీ సంక్షేమం అందాలన్నదే ధ్యేయం

- గ్రామగ్రామాన ఘనంగా జగనన్న సురక్ష క్యాంపులు
- అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత



సత్తెనపల్లి 7వ వార్డులో మహిళకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న కమిషనర్ షమ్మీ



కొత్తపల్లిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జడ్పీటీసీ విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ శివ సుబ్రహ్మణ్యం



న్యూచిట్యాలలో మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు

అచ్చంపేట: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను చేరవేసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని జడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామ సచివాలయంలో గురువారం జరిగిన జగనన్న సురక్ష కర్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీడీఓ శివశుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కార్యక్రమంలో మొత్తం 203 దరఖాస్తులు అందగా అందులో 180మందికి టోకెల్లు జవ్వడం జరిగిందన్నారు. 90మందికి కులం, 86మందికి ఆదాయం, ఇద్దరికి కుటుంబసభ్యుల సర్టిఫికెట్స్, 22మందికి సీసీఆర్సీ కార్డులు, ఒక్కరికి పాస్ పుస్తకం, ఒక్కరికి రేషన్‌కార్డు పంపిణీ చేశామన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు నూరుశాతం సబ్సిడీపై కందులు పంపిణీ చేశారు. ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, లిడ్‌క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని కస్తలలో తహసీల్దారు సీహెచ్ పద్మాదేవి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలకు కావలసిన ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం 82 మందికి కులం, ఆదాయం, కౌలురైతు కార్డ్స్, కొత్త రేషన్ కార్డులు, కుటుంబసభ్యుల కార్డ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ మహబూబ్ సుభాని, ఎంపీటీసీ గుడేటి మరియరాణి, వైఎస్సార్ సీపీ నాయకులు చెన్నమల్లు రవి, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సత్తెనపల్లి 7,8 వార్డులలో...

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించటమే జగనన్న సురక్ష ఉద్దేశ్యమని మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ చెప్పారు. పట్టణంలోని 7వ సచివాలయ పరిధిలోని 7,8 వార్డులలో జగనన్న సురక్ష క్యాంపులు హెగ్డే వారి వీధిలో హోటల్ కార్గిల్ దగ్గర గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.షమ్మి మాట్లాడుతూ చిన్నపాటి లోపాలతో ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి వారికి అవసరమైన ధ్రువీకరణపత్రం ఉచితంగా అందించటం జరుగుతుందన్నారు. రెండు వార్డుల్లో 955 గృహాలకు గాను 750 గృహాలు సర్వే చేసి 222 ధ్రువీకరణపత్రాలు ఉచితంగా మంజూరు చేశారు. కార్యక్రమంలో పార్టీ 7వవార్డు ఇన్‌చార్జ్ దేవరశెట్టి రవికుమార్, 26వవార్డు కౌన్సిలర్ శిరిగిరి సీతామహాలక్ష్మీ, 7వ వార్డు కన్వీనర్ దేసుమహేష్, మున్సిపల్ మేనేజర్ నెట్టెం సాంబశివరావు, సచివాలయసిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో...

బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి, రుద్రవరం గ్రామాల్లో జగనన్న సురక్ష క్యాంపులు గురువారం జరిగాయి. ఆయా క్యాంపుల్లో తహసీల్దార్ ఎం.భవానిశంకర్, ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదులు పాల్గొని అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. తొండపి గ్రామంలో 349మందికి, రుద్రవరంలో 347 మందికి అవసరమైన ధ్రువీకరణపత్రాలు అందించారు. సర్పంచ్ రాప్రోలు వెంకటకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజీఎం రామలింగారెడ్డి, శిరిగిరిగోపాలరావు, నక్కా శ్రీనివాసరావు, కాటయ్య, జానీబాషా పాల్గొన్నారు.

న్యూ చిట్యాల గ్రామంలో...

బెల్లంకొండ: అర్హులందరికీ పథకాలు అందజేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని న్యూ చిట్యాల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయంలో నిర్వహించిన ఈ సదస్సులో లబ్ధిదారులకు కావలసిన సర్టిఫికెట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి ప్రజల వద్దకే పరిపాలనను తీసుకువచ్చారని పేర్కొన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల వద్ద అర్జీలను స్వీకరించి, సత్వరమే పరిష్కారం జరుగుతుందని తెలిపారు. అనంతరం పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. తహసీల్దార్ దుర్గేష్, ఎంపీడీఓ వెంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ బాణావతు నరసింహానాయక్, ఎంపీటీసీ భుక్యా శ్రావణీబాయి తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ రాయితీతో కూడిన రుణాలివ్వాలి

కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన



ముప్పాళ్ల సీజీజీబీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కౌలు రైతుసంఘం నాయకులు, రైతులు

ముప్పాళ్ళ: కౌలు రైతులకు గ్రూపుల ద్వారా పంట రుణాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ వడ్డీరాయితీతో కూడిన పంట రుణాలను ఇవ్వాలని రాష్ట్ర కౌలురైతు సంఘం అధ్యక్షుడు వై.రాధాకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు వద్ద కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని కోరుతూ రైతులతో కలిసి గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయం నష్టాల్లో కొనసాగుతుందని, కౌలు రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం అందక కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూయజమాని సంతకం అనే నిబంధనను తొలగించి కౌలు రైతు కార్డులు ఇవ్వాలన్నారు. ప్రతి కౌలు రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం గ్యారెంటీ లేకుండా పంట రుణాలు ఇవ్వాలన్నారు. రిజర్వు బ్యాంకు ఆదేశాల మేరకు భూమి ఆధారంగా కాకుండా పంట ఆధారంగా రుణాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రామారావు, జిల్లా కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ, నాయకులు తొరటి అమరలింగేశ్వరరావు, కౌలు రైతులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, అన్నపురెడ్డి రంగారెడ్డి, కారుమూరి రఘునాధరెడ్డి అనెకల్లు రామలింగారెడ్డి, మధిరపెద్దారెడ్డి, మహీపతి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారుల తనిఖీలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

రాజుపాలెం: మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ శాఖ విజిలెన్స్ శాఖ అధికారులు గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రాజుపాలెం, కోటనెమలిపురి, కొత్తూరు, పెదనెమలిపురి, గణపవరం, రెడ్డిగూడెం గ్రామాలలో 38 మంది అధికారులు 114 మంది సిబ్బంది, 38 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. 3390 సర్వీస్‌లను తనిఖీ చేయగా అనుమతిలేకుండా 114 మంది విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు గుర్తించి, వారికి రూ3.71లక్షలు అపరాధ రుసుం చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. మీటరు లేకుండా డైరెక్టుగా విద్యుత్‌ను చౌర్యానికి పాల్పడుతున్న 43మందిని గుర్తించి, వారికి రూ.63 లక్షల అపరాధ రుసుం, మీటరు ఉన్నా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 8మందికి రూ.1.05లక్షలు, ఇతర కేటగిరిలో వాడుతున్న 5 మందికి రూ37వేలు , అధిక లోడు వాడుతున్న 58 మందికి రూ1.66లక్షలు అపరాధ రుసుము చెల్లించాలని నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. నిర్ణీత కాలంలో అపరాధ రుసుము చెల్లించకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.విజయకృష్ణ, పరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.హరిబాబు, డీఈఈలు ఎమ్.రవికుమార్, కె.రవికుమార్, ఎస్కే బాజీ, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎ.చంద్రశేఖర్, వి.విజ్ఞాన్ ప్రసాద్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ



మాట్లాడుతున్న శివలక్ష్మి

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద విభిన్న ప్రతిభావంతులకు సహాయక పరికరాలను ఉచిత పంపిణీలో భాగంగా గుర్తింపు శిబిరం గురువారం నిర్వహించారు. దివ్యాంగులకు ఉపయోగపడే ఉపకరణములు ఉచితంగా అందజేసేందుకే ఈ శిబిరం నిర్వహించినట్లు డిజేబుల్డ్ సూపర్‌వైజర్ డి. శివలక్ష్మీ కలెక్టర్ ఉత్తర్వుల మేరకు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, సమాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వంకు సంభందించి అలెన్‌కో ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాలు అందజేయడంలో భాగంగా ఈ గుర్తింపు శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. గుర్తింపు శిబిరంలో ఉపకరణాలు కావాల్సిన విభిన్న ప్రతిభావంతుల పేర్లు నమోదు చేసుకొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 125 మందికి అవసరమైన వివిధ రకాల ఉపకరణాలు నమోదు చేసుకున్నామని, వీటిని త్వరలో అందజేస్తామన్నారు. వినికిడి యంత్రాలు, ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, మోటార్ బైక్స్, బ్రెయిలీకిట్, క్యాలిపర్స్, క్రచర్స్ తదితర ఉపకరణాలు అర్హతను బట్టి అందజేస్తామని డిజేబుల్డ్ సూపర్‌వైజర్ తెలిపారు. కార్యక్రమంలో స్ఎస్ఏ అసిస్టెంట్ ఐఇ కోఆర్డినేటర్ మల్లికార్జున, వైద్య బృందం, సమగ్ర శిక్షా అధికారులు, ఇన్‌చార్జి ఎంపీడీఓ జిలానీబాషా, స్టేట్ బిసి కార్పొరేషన్ డైరెక్టర్ డి. గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు ఎరువుల దుకాణాలపై కేసులు

క్రోసూరు: అనుమతిలేని గడ్డిమందు విక్రయిస్తున్న సమాచారం మేరకు గుంటూరు రీజనల్ విజిలెన్స్ అధికారులు గురువారం మండలంలోని నాగవరం గ్రామంలో ఎరువుల షాపుల్లో తనిఖీలు నిర్వహించి రెండు షాపులపై కేసులు నమోదు చేసినట్లు ఏఓ వేణుగోపాల్ తెలిపారు. విజిలెన్స్ అధికారి ఈశ్వరరావు, విజిలెన్స్ ఏఓ వాసంతి, ఇతర అధికారుల తనిఖీల్లో అనుమతి లేని గడ్డిమందు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గ్రామంలోని సుబ్రమణ్య ఫర్టిలైజర్స్, సాయిమణికంఠ ఎరువులు, పురుగుల మందుల దుకాణాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన స్టాక్ స్థానిక పోలీసుస్టేషన్‌కు అప్పగించటం జరిగింది.

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష క్యాంపులు

క్రోసూరు: మండలంలోని ఆవులవారిపాలెం, అనంతవరం గ్రామాల్లో శుక్రవారం జగనన్న సురక్ష శిబిరాలు జరుగుతాయని ఎంపీడీఓ బి.మహేష్ గురువారం తెలిపారు. ఈ శిబిరాలకు ఎంపీడీఓ, తహసీల్దార్ రెండు టీములుగా హాజరై ప్రజలకు కావాల్సిన ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

శభాష్.. కండక్టర్!

- బస్సులో బంగారు ఆభరణాలతో కూడిన పర్సు మర్చిపోయిన మహిళ
- గుర్తించి అప్పగించిన కండక్టర్ జవహర్



సత్తెనపల్లి ఆర్టీసీ డిపోలో మహిళకు పర్సు అప్పగిస్తున్న కండక్టర్ జవహర్

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): ఆర్టీసీ బస్సులో బంగారు ఆభరణాలతో కూడిన పర్సు పోగొట్టుకున్న మహిళకు ఆ పర్సును అందించి నిజాయితీ చాటుకున్నాడు సత్తెనపల్లి డిపోకి చెందిన కండక్టర్ సన్నాయిల జవహర్. వివరాల్లో వెళితే సత్తెనపల్లికి చెందిన గాడిపర్తి జయలక్ష్మి అమరావతి సమీపంలోని ముత్తాయిపాలెం వెళ్లేందుకు గాను సత్తెనపల్లి ఆర్టీసీ డిపోలో అమరావతి వైపు వెళ్లే బస్సు ఎక్కింది. బస్సులో పర్సు మరిచిపోయి అమరావతిలో బస్సు దిగి వెళ్లిపోయింది. డ్యూటీలో ఉన్న కండక్టర్ పర్సును గమనించి నేరుగా సత్తెనపల్లి డిపోలోని ఏడీసీ రమణారెడ్డికి అప్పగించాడు. పర్సులో రెండు బంగారు గొలుసులు, 2 ఏటీఎం కార్డు లు, రెండు చిన్నపాటి బంగారుబిళ్లలు తో పాటుగా రూ. 3,500 నగదు ఉన్నట్లుగా గుర్తించారు. పర్సులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా పర్సు పోగొట్టుకున్న జయలక్ష్మిని ఆర్టీసీ డిపోకు పిలిపించి అప్పగించారు. పోయిన బంగారు ఆభరణాలు దొరకటంతో జయలక్ష్మి ఆనందంతో కన్నీటి పర్యంతమైంది. రూ.లక్షకు పైగా విలువ చేసే వస్తువులను నిజాయితీగా అప్పగించిన కండక్టర్ సన్నాయిల జవహర్‌ను శభాష్..కండక్టర్ అంటూ తోటి సిబ్బంది, ప్రయాణికులు అభినందించారు.

ప్రమాదాలు జరగకుండా చూడండి



సూచనలు చేస్తున్న డీఎస్పీ మహేష్

నరసరావుపేట: స్కూలు, కళాశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులను ఇంటి నుంచి స్కూల్‌కి, స్కూల్ నుంచి ఇంటికి తీసుకు వెళ్లే క్రమంలో బస్సులకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా యాజమాన్యాలు, డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ కేవీ మహేష్ కోరారు. గురువారం డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు నరసరావుపేటలో పట్టణ, రూరల్ పరిధిలో స్కూళ్ల యజమానులు, బస్‌డ్రైవర్లతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, పాటించవలసిన పద్ధతులపై పలు సూచనలు చేశారు. బస్సులు యాక్సిడెంట్ జరగకుండా చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ఇదే విధంగా వినుకొండ, చిలకలూరిపేట స్కూల్ యాజమాన్యం, బస్ డ్రైవర్లతో సమావేశం నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

ప్రాథమికస్థాయిలోనే జీవన నైపుణ్యాలపై అవగాహన

యడ్లపాడు: విద్యార్థుల్లో ప్రాథమికస్థాయి నుంచే జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించి..వారిని సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని ఉమ్మడి జిల్లాల ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎం సుభాని చెప్పారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఎస్‌సీఈఆర్‌టీ, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాల శిక్షణ కార్యక్రమం గురువారం ఆయన ప్రారంభించారు. బోయపాలెం జిల్లా విద్యా శిక్షణ సంస్థలో మూడు రోజులు పాటు నిర్వహించే ఈ శిక్షణా తరగతులకు గుంటూరు జిల్లా పరిధిలోని 50 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 100 మంది పీడీ/పీఈటీ, యాక్టివ్ టీచర్ ఒకరు చొప్పున హాజరయ్యారు. ప్రారంభ సమావేశంలో డైట్ ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని మాట్లాడుతూ పిల్లలకు ప్రాథమిక స్థాయి నుంచే జీవన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన వారిచే ఎంపిక చేసిన పాఠశాలల్లోని పాఠశాలల్లోని టీచర్లకు మూడు రోజులు పాటు తర్ఫీదు ఇవ్వనున్నట్లు వివరించారు. ఆయా అంశాలను తమ పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. ఫౌండేషన్ సౌత్‌ఇండియా టీం సభ్యులు శిక్షణ లక్ష్యం గురించి వివరించారు. డైట్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కె ప్రసాద్, కె యోగేశ్వరరావు, టి శ్రీనివాసరావు, అజయ్‌కుమార్ జీవన నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు.

అసత్య ఆరోపణలు తగదు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): మున్సిపల్ ఎస్ఎస్ ట్యాంక్ ద్వారా వచ్చే నీటిపై టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి సాంబశివరావు చెప్పారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ వర్షంపడితే నీరు రంగు మారుతుందనే విషయం తెలియక సోషల్‌మీడియాలో ప్రచారం చేయటం హాస్యాస్పదం అన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేయవలసిన ఫిల్టర్‌బెడ్‌లు క్లీనింగ్ చేయకపోతే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.50లక్షలతో మరమ్మతులు చేపట్టి పట్టణ ప్రజలకు రక్షిత నీటిని అందిస్తున్నామన్నారు. ప్రతిరోజు టెక్నికల్ సిబ్బందిచే నీటి నాణ్యత పరీక్షించిన తరువాతనే నీటిని విడుదల చేయటం జరుగుతుందనే విషయం తెలుసుకోవాలన్నారు. గతంలో ఎండాకాలంలో నీరు అందించిన దాఖలాలు లేవనే విషయం గుర్తు చేసుకోవాలన్నారు. ఊహాజనిత వార్తలు సోషల్‌మీడియాలో ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

యడ్లపాడు: వీధిలో గేదెను కట్టేయడంతో గొడవ జరిగి కేసు వరకు దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉన్నవ గ్రామంలో ఎస్సీ కాలనీకు వెళ్లే మార్గంలో ఉన్నవ శ్రీనివాసరావు అనే వ్యక్తి తన దూడను కట్టేసి సమీపంలోని ఇంట్లోకి వెళ్లాడు. ఇంతలోనే కట్టు ఊడదీసుకున్న దూడ అటుగా వస్తున్న కె.ఉదయలక్ష్మి అనే మహిళపైకి దూకింది. ఆమె చేయి అడ్డుపెట్టే సరికి కొమ్ము తగిలి కిందపడిపోయింది. విషయం తెలుసుకున్న మహిళ కుమారుడు వేణు వీధిలో గేదెను ఎందుకు కట్టేశావంటూ గొడవపడ్డాడు. అనారోగ్య సమస్యలతో ఉన్న శ్రీనివాసరావును దుర్భాషలాడుతూ దాడి చేశాడంటూ ఏపీ రజక యువసేన సంఘం అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కిసాన్ క్రెడిట్ కార్డులు సద్వినియోగం చేసుకోండి

శావల్యాపురం: కిసాన్ క్రెడిట్ కార్డులను పాడిరైతులు సద్వినియోగం చేసుకుని జీవనోపాదులు పెంపొందించుకోవాలని డివిజన్ పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డి.నరసింహులు అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో జననన్న పాలవెల్లువ కార్యక్రమం పురోగతి, కిసాన్ క్రెడిట్ కార్డు పథకం తదితర వాటిపై ఆయన సమీక్షించారు.